సాక్షి
అనకాపల్లి
సోమవారం । 25 । ఆగస్టు । 2025



ఆగని గ్రావెల్ దందా 8లో

సెలవు రోజుల్లో అక్రమార్కులు దూకుడు పెంచారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో గ్రావెల్ తరలింపు జోరుగా సాగింది.



అప్పన్నకు ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం స్వర్ణపుష్పార్చన సేవ తదితర ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి.

ఓ మట్టి గణపయ్యా



విశాఖ: పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ లాసన్స్‌బే కాలనీలో పిల్లలు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేశారు. వినాయక చవితి పండగ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఇలాగేనా స్ఫూర్తి నింపేది!

- జిల్లాలో ఇన్‌స్పైర్ మనక్‌కు స్పందన కరువు
- ఇప్పటివరకు 5 పాఠశాలల నుంచే నామినేషన్లు
- వచ్చే నెల 15తో ముగియనున్న గడువు
- జిల్లాలో రెండేళ్లుగా జరగని ఎగ్జిబిషన్లు
- టీచర్లపై బోధనేతర పనుల ఒత్తిడే కారణం

విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో.. పాఠశాల స్థాయిలోనే వారిలో సృజనాత్మకతను వెలికితీసేందుకు ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ పోటీలకు స్పందన కరువైంది. కేంద్ర ప్రభుత్వం మంచి ఉద్దేశంతో రూపొందించిన ఈ కార్యక్రమానికి ఈ ఏడాది జిల్లాలో అనుకున్న స్థాయిలో స్పందన కనిపించడం లేదు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 602 స్కూళ్లు ఉంటే ఇప్పటి వరకు కేవలం 5 స్కూళ్ల నుంచి మాత్రమే ప్రాజెక్టులు నమోదయ్యాయి.



చోడవరం మండలం లక్ష్మీపురం జెడ్పీ స్కూల్ విద్యార్థులు రూపొందించిన నమూనా (ఫైల్)



యలమంచిలిలో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో నమూనాలు ప్రదర్శించిన కొక్కిరాపల్లి అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు (ఫైల్)



సౌర వ్యవస్థ నమూనా (ఫైల్)

జిల్లాలో ఉన్నత పాఠశాలలు **412**	ఇప్పటి వరకు నామినేషన్లు నమోదు చేసుకున్న స్కూళ్లు **5**
ప్రాథమికోన్నత పాఠశాలలు **190**	నమోదైన ప్రాజెక్టులు **25**

యలమంచిలి రూరల్: చిట్టి బుర్రల్లో నూతన ఆలోచనలు, ఆవిష్కరణలను రేకెత్తించే ఇన్‌స్పైర్ మనక్ స్కీమ్‌ను దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ ప్రవేశపెట్టారు. విద్యార్థులను బాలశాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. తొలుత ఆసక్తి గల విద్యార్థులను గుర్తించేందుకు పోటీలు నిర్వహిస్తారు. ఈ పోటీలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు జిల్లాలో కేవలం 5 స్కూళ్ల నుంచి 25 నామినేషన్లు మాత్రమే వచ్చాయి. జిల్లాలో 602 పాఠశాలల నుంచి సుమారు 2500 మంది విద్యార్థులు నవ ఆలోచనలు పంపేందుకు అవకాశం ఉండగా ఇప్పటివరకు 25 మందే స్పందించారు. ఇన్‌స్పైర్‌లో ప్రతిభ కనబరిచే విద్యార్థులు రాష్ట్రపతి, ప్రధానమంత్రిని కలుసుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఇన్‌స్పైర్‌కు ఆసక్తి తగ్గడానికి కూటమి ప్రభుత్వం టీచర్లపై మోపుతున్న వివిధ రకాల ఒత్తిడులే కారణంగా తెలుస్తోంది. ఈ ఏడాది స్కూళ్లు ప్రారంభమైనప్పటి నుంచి యోగాంధ్ర, మెగా పీటీఎం, సంస్కరణల పేరుతో మారిన ఎఫ్ఏ పరీక్షల మూల్యాంకనం.. ఇలా అనేక రకాలుగా టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెడుతోంది. దీంతో విద్యార్థుల్లో సృజనాత్మకతను నింపాల్సిన కీలకమైన ఇన్‌స్పైర్ వంటి కార్యక్రమాలపై దృష్టి సారించేందుకు అవకాశం ఉండడం లేదని ఉపాధ్యాయులు లోలోన మధనపడుతున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా..

కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ ఏటా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనల్లో భాగంగా 2025–26 విద్యా సంవత్సరానికి ఆన్‌లైన్‌లో ప్రతిపాదనలు స్వీకరించేందుకు వచ్చే నెల 15తో గడువు ముగియనుంది. ఆన్‌లైన్‌లో పాఠశాల అథారిటీ ఆప్షన్‌లోకి వెళ్లి వన్‌టైమ్ రిజిస్ట్రేషన్‌లో వివరాలు నమోదు చేయాలి. విద్యార్థి పుట్టిన తేదీ, తల్లి, తండ్రి ఆధార్ సంఖ్య తదితర వివరాలు, బ్యాంకు ఖాతా ఫొటో, తయారు చేసిన ప్రాజెక్టు రైటప్, ప్రాజెక్టు చిత్రాలు లేదా 300 పదాలకు మించని వివరణ అప్‌లోడ్ చేయాలి. ఎంపికైన ప్రతి ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో రూ.10 వేల నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎంపికైతే ఒక్కో ప్రాజెక్టుకు రూ.25 వేల వరకు పారితోషికం అందించడంతోపాటు రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనకు, జపాన్ పర్యటనకు అవకాశం కల్పిస్తారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల నుంచి ఐదు, ప్రాథమికోన్నత పాఠశాల స్థాయిలో మూడు చొప్పున విద్యార్థులతో ప్రాజెక్టులను రూపొందించాలి. విద్యార్థులకు గైడ్‌గా వ్యవహరించేందుకు సైన్స్ ఉపాధ్యాయులకు బాధ్యత అప్పగించాలి.

రెండేళ్లుగా జరగని ఎగ్జిబిషన్లు

జిల్లాలో ఇన్‌స్పైర్ మనక్‌కు సంబంధించి 2023–24, 2024–25 సంవత్సరాల్లో నిర్వహించాల్సిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు ఇప్పటివరకు జరగలేదు. కరోనా కారణంగా ప్రదర్శనలు ఆలస్యమైనప్పటికీ గత ప్రభుత్వ హయాంలో 2022–23కు సంబంధించిన ప్రదర్శనను అనకాపల్లిలో నిర్వహించారు. ఆ తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణపై నిర్లక్ష్యం చూపారన్న విమర్శలున్నాయి. ఈ కారణంగా విద్యార్థులు, సైన్సు టీచర్లలో నిర్లిప్తత చోటు చేసుకుంది. అంతేకాకుండా ఇన్‌స్పైర్ మనక్‌కు టీచర్లలో ఆసక్తి కలిగించేందుకు ప్రతి ఏటా నిర్వహించాల్సిన జిల్లా స్థాయి అవగాహన, సన్నద్ధత సమావేశం ఇప్పటివరకు నిర్వహించలేదు. మరో 20 రోజుల్లో గడువు ముగియనుండడంతో జిల్లా అధికారులు దీనిపై శ్రద్ధ చూపితేనే ఆశించిన ప్రయోజనం దక్కుతుంది.

నేడు, రేపు ఓరియంటేషన్ క్లాసులు

అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్లలో ఓరియంటేషన్ క్లాసులు నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అనకాపల్లి డివిజన్‌లో ఉన్న అన్ని పాఠశాలలకు అనకాపల్లి టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో, మంగళవారం నర్సీపట్నం డివిజన్ పాఠశాలలకు నర్సీపట్నం మెయిన్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో తరగతులు నిర్వహించనున్నారు. దీనికి పాఠశాల నుంచి హెచ్‌ఎం, సైన్స్ టీచర్ తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సూచించారు.

హెచ్‌ఎంలు ప్రోత్సహించాలి



ఎక్కువమంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేలా ప్రధానోపాధ్యాయులు ప్రోత్సహించాలి. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనక్ అవార్డులు మంచి అవకాశం. జిల్లాలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సైన్స్ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ వహించి సెప్టెంబర్ 15 లోగా విద్యార్థులతో నామినేషన్లు పంపించేలా చూడాలి.

– దాడి కాళిదాస్, జిల్లా సైన్స్ అధికారి

పచ్చనేతల ప్రచార యావ..



వీరవల్లి అగ్రహారం పాఠశాల గేటు పక్కన్న ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు

మాడుగుల రూరల్ : అధికారంలో ఉన్న కూటమి నాయకుల ప్రచారానికి గుడి, బడి అంటూ తేడా ఏమీ లేదు. మండలంలో వి.వి.అగ్రహారం ఎంపీయూపీ పాఠశాల గేటు ప్రవేశ ద్వారం వద్ద పెద్ద డిజిటల్ బోర్డును ఈ నెల 16వ తేదీన ఏర్పాటు చేశారు. ఆరోజున దేశం పార్టీ ఆధ్వర్యంలో ట్రాక్టరు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వడ్డాది నుంచి వి.వి.అగ్రహారం గ్రామం వరకు డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద బోర్డు ఏర్పాటు చేసి, 10 రోజులు కావస్తున్నా సరే బోర్డును ఇక్కడ నుంచి తొలగించలేదని విద్యార్థులు, గ్రామస్తులు విస్మయం చెందుతున్నారు.

న్యూస్‌రీల్

పెన్షన్ల పునరుద్ధరణ కోసం..

- నేడు కలెక్టర్‌ను కలవనున్న వైఎస్సార్‌సీపీ నేతలు

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం అన్యాయంగా తొలగిస్తున్న పెన్షన్లను తక్షణమే పునరుద్ధరించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేయనున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో స్థానిక రింగ్‌రోడ్డు పార్టీ కార్యాలయం నుంచి కలెక్టర్ కార్యాలయానికి పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్‌తో పాటు వివిధ నియోజకవర్గ సమన్వయకర్తలు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

పరుగులు పెట్టించిన భారీ కొండచిలువ



స్థానికుల చేతిలో హతమైన భారీ కొండచిలువ

కోటవురట్ల: భారీ కొండచిలువ స్థానిక రైతుల చేతిలో హతమైంది. రాట్నాలపాలెం శివారు కొండను ఆనుకుని ఉన్న తుమ్మలపల్లి అంజనేయులు పొలంలో ఆదివారం వ్యవసాయ పనులు చేస్తున్నారు. అదే సమయంలో 12 అడుగుల భారీ కొండచిలువ కనిపించేసరికి కూలీలు హడలెత్తి పరుగులు తీశారు. ధైర్యం చేసిన కొందరు కొండచిలువను హతమార్చారు.

స్త్రీతో కార్మికుల జీవితాలకు మరింత ధీమా

- నమోదు చేసుకోని సంస్థలకు సువర్ణావకాశం
- ఈఎస్‌ఐసీ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌కే సాహూ



తాటిచెట్లపాలెం: కేంద్ర కార్మిక, ఉపాధి శాఖకు చెందిన కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐ)లో అర్హులైన సంస్థలు, కర్మాగారాలు తమను తాము నమోదు చేసుకోవాలని విశాఖ ఈఎస్‌ఐసీ ఉప ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్ (ఇన్‌చార్జి) సోమేంద్ర కుమార్ సాహూ తెలిపారు. నరసింహనగర్‌లోని ఈఎస్ఐ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఈ వివరాలను వెల్లడించారు.

గత బకాయిల నుంచి మినహాయింపు

సాధారణంగా ఈఎస్ఐలో నమోదు చేసుకున్న సంస్థలు గత ఐదేళ్ల బకాయిలు, వడ్డీ, నష్టపరిహారంతో సహా చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఈ పథకం ద్వారా నమోదు చేసుకుంటే ఈ భారం నుంచి మినహాయింపు పొందొచ్చు.

పాత బకాయిలు, తనిఖీలు ఉండవు

ఈ పథకంలో నమోదు చేసుకున్న తేదీ కంటే ముందు సమయానికి సంబంధించిన చందాలు కట్టనవసరం లేదు. అలాగే ఈఎస్ఐ కూడా గత సమయానికి సంబంధించిన క్లెయిములు, తనిఖీలు చేయదు.

నమోదుకాని ఉద్యోగుల నమోదు

ఇప్పటికే ఈఎస్ఐలో నమోదు చేసుకుని, ఇంకా కొంతమంది ఉద్యోగులను నమోదు చేయని సంస్థలు ఈ పథకం ద్వారా వారిని చేర్చుకోవచ్చు. వారికి కూడా నమోదు చేసిన తేదీ నుంచి చందా, ఇతర ప్రయోజనాలు వర్తిస్తాయి.

ఈఎస్ఐ పరిధి, ప్రయోజనాలు

కార్మిక రాజ్య బీమా సంస్థ అసంఘటిత రంగ కార్మికులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత కల్పిస్తుందని అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యాంప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 22.24 లక్షల కర్మాగారాలు, సంస్థలు ఈ పథకం కింద నమోదయ్యాయి, వీటిలో 3.72 కోట్ల కార్మికులు ఉన్నారు.

ఎవరు అర్హులు?

10 లేదా అంతకంటే ఎక్కువ మంది కార్మికులు ఉన్న ఏ కర్మాగారాలు లేదా సంస్థలైనా ఈఎస్ఐ చట్ట పరిధిలోకి వస్తాయి. వీటిలో సినిమా హాళ్లు, రవాణా సంస్థలు, ప్రింటింగ్ ప్రెస్‌లు, వార్తా సంస్థలు, హోటళ్లు, రెస్టారెంట్లు, దుకాణాలు, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, ప్రైవేట్ విద్యా సంస్థలు, ఆసుపత్రులు, పెట్రోల్ బంకులు, సెక్యూరిటీ ఏజెన్సీలు మొదలైనవి ఉంటాయి.

ప్రయోజనాలు

ఈఎస్ఐ చట్ట పరిధిలో ఉన్నప్పటికీ, ఇంతవరకు నమోదు చేసుకోని సంస్థల కోసం 'స్కీం ఫర్ ప్రమోషన్ ఫర్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్'(స్ప్రీ) పథకాన్ని ఈఎస్ఐ తిరిగి ప్రారంభించింది. ఈ పథకం జూలై 1, 2025 నుంచి డిసెంబరు 31, 2025 వరకు అమలులో ఉంటుంది. ఈ పథకం కింద నమోదు చేసుకునే సంస్థలకు గత బకాయిల నుంచి మినహాయింపు లభిస్తుంది.

ఎవరెవరికి లాభం

వర్క్‌మెన్ కాంపెన్సేషన్ చట్టం, 1923, మెటర్నిటీ చట్టం, 1961 నుంచి మినహాయింపు లభిస్తుంది. ఉద్యోగుల వైద్య ఖర్చుల బాధ్యత నుంచి ఉపశమనం లభిస్తుంది. కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు సంపూర్ణ ఆరోగ్య భద్రత లభిస్తుంది. అనారోగ్యం, ప్రసవం, ఉద్యోగ సంబంధిత ప్రమాదాలు, వైకల్యం వంటి సందర్భాల్లో ఆర్థిక సహాయం అందుతుంది.

చందా వివరాలు

నెలసరి వేతనం రూ. 21,000 లేదా అంతకంటే తక్కువ ఉన్న కార్మికులకు ఈఎస్ఐ వర్తిస్తుంది. దివ్యాంగులకు ఈ పరిమితి రూ. 25,000. కార్మికుల వాటా మొత్తం వేతనంపై 0.75 శాతం ఉంటుంది. మొత్తం వేతనంపై 3.25 శాతం ఉంటుంది. ఈ రెండు వాటాలను కలిపి ప్రతి నెలా 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. రూ. 176 లేదా అంతకంటే తక్కువ దినసరి వేతనం పొందే కార్మికులకు చందా మినహాయింపు ఉంటుంది, కానీ యజమాని వాటా చెల్లించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాల కోసం నరసింహనగర్‌లోని ఉప ప్రాంతీయ కార్యాలయాన్ని లేదా టోల్‌ఫ్రీ నంబర్ 1800–11–2526ను సంప్రదించవచ్చు.



'స్ప్రీ' కరపత్రికను విడుదల చేస్తున్న ఈఎస్‌ఐసీ ఉప ప్రాంతీయ కార్యాలయం అధికారులు

సముద్రపు ఇసుక తరలింపునకు వేలంపాట?

- ఏడాది కాలానికి రూ.3 లక్షలకు పాడుకున్న గ్రామ స్థాయి కూటమి నేత
- వాడనర్సాపురంలో తొలిసారి అనధికార ఇసుక రీచ్ కోసం వేలంపాట
- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తహసీల్దార్!



వాడనర్సాపురం సముద్ర తీరంలో ఉన్న ఇసుక తిన్నెలు

రాంబిల్లి (అచ్యుతాపురం): కాదేదీ వ్యాపారానికి అనర్హం. మత్స్య వేట తగ్గడంతో ఆదాయ వనరుపై తీర ప్రాంతంలోని కొందరు నేతలు దృష్టి సారించారు. కేవలం గ్రామ అభివృద్ధి కోసమే అని చెబుతున్నప్పటికీ తొలిసారి రాంబిల్లి మండలంలోని వాడనర్సాపురంలో ఇసుక రీచ్‌కు వేలం పాట నిర్వహించారు. స్థానిక గ్రామ స్థాయి కూటమి నేత ఏడాది పాటు ఇసుకపై హక్కులు పొందేందుకు గానూ రూ.3 లక్షలకు పాట దక్కించుకున్నారు. వినాయక చవితి ఉత్సవాల కోసమే వేలంపాట నిర్వహించినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. నేవల్ బేస్‌కు సంబంధించిన జెట్టీ వల్ల వాడనర్సాపురం సముద్ర తీరంలో చేపల వేట సాగడం లేదు. గ్రామానికి రెండో వైపు ఉన్న పైడమ్మ చెరువు ప్రాంతాన్ని నేవల్ బేస్ పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుంది. ఒకప్పుడు ఆయా కొండల్లో గ్రావెల్, చేపల వేట ద్వారా వచ్చే ఆదాయంతో స్థానికంగా పండుగలు నిర్వహించుకునేవారు. ఇప్పుడు వేట సాగక మత్స్యకారులు వలస పోవడంతో నిధులు లేక వేలంపాట నిర్వహించామని నిర్వాహకులు సమర్థించుకుంటున్నా ఆ ప్రాంతంలో ఈ విషయం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

వాడనర్సాపురంలో ఇసుక వేలం పాట నిర్వహించినట్లుగా వచ్చిన ఫిర్యాదుపై తహసీల్దార్ స్పందించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా తెలిసింది. సముద్ర తీరంలోని ఇసుకను వేలం పాట వేసేందుకు ఎలా అనుమతిస్తామని తహసీల్దార్ ప్రశ్నించినట్టు సమాచారం.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయం

వాడనర్సాపురానికి చెందిన పలువురు ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. ఏడాది పాటు ఇసుక తరలింపు హక్కులు పొందిన వ్యక్తిపై, వేలం పాట నిర్వహించిన నేతలపై పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలని నిర్ణయించారు. గతంలో ఎన్నడూ ఈ తరహా వేలం పాట నిర్వహించలేదని స్థానిక మత్స్యకారులు కొందరు పేర్కొనడం గమనార్హం. సముద్ర తీరంలోని ఇసుక కోసం దిబ్బలను తవ్వేస్తే గ్రామానికి ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అన్ని పార్టీల్లోనూ తీవ్ర చర్చ నడుస్తోంది.

ఇస్కాన్‌లో మార్మోగిన హరినామస్మరణ



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరం హరే కృష్ణ, హరే రామ నామస్మరణతో ఆదివారం మార్మోగింది. వారాంతపు పూజలు సందర్భంగా ఇస్కాన్ అధ్యక్షులు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని భగవద్గీత శ్లోకాలను ఆలపించారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ఇంటర్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా అప్పారావు



ఎన్నికైన ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్‌జీవో అధ్యక్షుడు ఈశ్వరరావు

మద్దిలపాలెం: విశాఖ ఉమ్మడి జిల్లా ఇంటర్మీడియట్ విద్యా ఉద్యోగుల సంఘం ఎన్నికలు ఆదివారం ఏకగ్రీవంగా జరిగాయి. జి.వి.అప్పారావు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బి.రామారావు ఉపాధ్యక్షుడిగా, బి.సి.హెచ్.సుధాకర్ కార్యదర్శిగా, కె.జగదీశ్వరరావు సంయుక్త కార్యదర్శిగా, బి.సుశీల మహిళా కార్యదర్శిగా, ఎన్.మురళీమోహన్ కోశాధికారిగా, కె.సిహెచ్.నాయుడు ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఎం.దుర్గాప్రసాద్, ఎన్.గీతాకుమారి, బి.పుష్పకుమార్, సంతోష్ కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఏపీఎన్జీవో అధ్యక్షుడు కె.ఈశ్వరరావు, జిల్లా కార్యదర్శి రవిశంకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.అప్పలరాజు ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల పరిధిలో ఇంటర్మీడియట్ విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఈ సంఘం సేవలందించనుందని నూతన అధ్యక్షుడు జి.వి.అప్పారావు తెలిపారు.

వీవోఏలు పోరాటానికి సిద్ధం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న సిటు రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు



సమావేశానికి హాజరైన వీవోఏలు

- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరరావు పిలుపు

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో వీవోఏలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం వీవోఏల (యానిమేటర్ల) జిల్లా 4వ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 3 సంవత్సరాల కాలపరిమితి సర్క్యులర్‌ను అధికారం చేపట్టిన వెంటనే రద్దు చేస్తామని ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలన్నారు. వీవోఏల సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని సభలో తీర్మానం చేశారు. వీవోఏల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు సీహెచ్ రూపాదేవి, వీవోఏల యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె.సూరిబాబు, సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వి.వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆ జ్ఞాపకాల వీధుల్లో బాల్యం పరుగు 8లో

క్లుప్తంగా

మూడు తరాల్లోనూ ఉపాధ్యాయులే


నామాల నీలిమ

అచ్యుతాపురం : ఆ కుటుంబంలో మూడు తరాల వారు ఉపాధ్యాయ ఉద్యోగం చేసే అదృష్టాన్ని పొందారు. అచ్యుతాపురం మండలంలోని మడుతూరుకు చెందిన నామాల వెంకటరమణ ఉపాధ్యాయునిగా పని చేసి పదవీవిరమణ పొందిన తర్వాత చనిపోయారు. వెంకటరమణ కుమారుడు నామాల సత్యశ్రీనివాస్ ప్రస్తుతం హరిపాలెం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. శ్రీనివాస్ కుమార్తె నీలిమ తాజాగా 2025 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ పోస్టు, ఎస్‌జీటీ పోస్టుకు కూడా ఎంపికయ్యారు. స్కూల్ అసిస్టెంట్ బయోలజికల్ సైన్స్‌లో జిల్లా స్థాయిలో 4వ ర్యాంక్,ఎస్‌జీటీ విభాగంలో జిల్లా స్థాయిలో 96వ ర్యాంక్ సాధించారు. తొలి ప్రయత్నంలోనే తన కుమార్తె రెండు పోస్టులకు ఎంపికయ్యారని, మా కుటుంబంలోని మూడు తరాల వారికి ఉపాధ్యాయ వృత్తి చేసే అదృష్టం దక్కిందని శ్రీనివాస్ సాక్షికి తెలిపారు.

ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక


నరేంద్ర

నక్కపల్లి : మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన యువకుడు ఒకేసారి రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన పిట్ల స్వామి నరేంద్ర తల్లిదండ్రులు కూలి పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. తన రెక్కల కష్టం మీద ఇద్దరు ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి కొడుకును ఉన్నత చదువులు చదివించారు. నరేంద్ర ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఏపీఎస్పీ సివిల్ విభాగాల్లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. అలాగే డీఎస్సీ ఫలితాల్లో ఎస్‌జీటీ విభాగంలో 84.65 శాతం మార్కులతో 100వ ర్యాంకు సాధించి ఉపాధ్యాయుడిగా కూడా ఎంపికయ్యాడు. ఒకేసారి తమ కుమారుడు రెండు ఉద్యోగాలు సాధించడం పట్ల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మమకారంతో గతంలో నేవీలో వచ్చిన ఉద్యోగాన్ని సైతం వదులుకున్నానని నరేంద్ర తెలిపాడు. ఉపాధ్యాయుడిగా చేరి గ్రూప్ సర్వీసెస్‌కు ప్రిపేర్ అయి ప్రజాసేవచేసే ఉన్నత ఉద్యోగం సంపాదించడమే లక్ష్యమని తెలిపారు.

ఆగని అక్రమ గ్రావెల్ దందా

- సెలవు రోజుల్లో దూకుడు పెంచిన అక్రమార్కులు
- పత్తాలేని రెవెన్యూ అధికారులు


లోవపాలెం వద్ద తరలించిన గ్రావెల్ తర్వాత ఖాళీ అవుతున్న కొండ


మడుతూరులో తరలిస్తున్న అక్రమ గ్రావెల్

అచ్యుతాపురం : సెలవులొస్తే అధికారులకు విశ్రాంతి. గ్రావెల్ అక్రమార్కులకు నిద్ర పట్టదు.సెలవు దినాల్లో స్తబ్ధుగా ఉండే అధికారుల అలసత్వాన్ని ఉపయోగించుకొని గ్రావెల్ డిమాండ్‌కు తగ్గట్టుగా జడలు విప్పుతున్నారు. అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకూ గ్రావెల్ తరలింపు జోరుగా సాగిపోయింది. రహదారుల అవసరాలకని కొందరు మీడియా ముందు ప్రకటించినప్పటికీ ఎటువంటి అనుమతు లు లేకుండా గ్రావెల్‌ను తరలించుకుపోవడం నేరమే. వాల్టా చట్టం ఉల్లంఘనతో స్థానిక పరిస్థితు ల వాతారణ సమతుల్యత దెబ్బతింటుందనే స్పృహ లేకుండా గ్రావెల్‌ను తవ్వేస్తున్నారు. దీంతో కొండలు రూపురేఖలు కోల్పోతున్నాయి. ఇటీవల కాలంలో లే అవుట్‌లకు, పరిశ్రమల అవసరాలకు గ్రావెల్‌ను తరలించుకుపోవడం షరా మామూలు అయ్యింది. భూగర్భ గనుల శాఖ పరిధిలో తాత్కాలిక ప్రాతిపదికన, నిర్ణీత కాల పరిమితితో గ్రావెల్ తవ్వకాలకు అనుమతిస్తారు. దీనికి టన్నుకు కొంత మేరకు సీనరైజ్ చెల్లించాలి. ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్‌ను తరలించుకుపోవడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది.

కంపెనీలు ఎలా అనుమతిస్తున్నాయో..?

సెజ్‌లోని పరిశ్రమలకు గ్రావెల్ అవసరం ఎక్కువగా పడింది. అచ్యుతాపురం–అనకాపల్లి రోడ్డు విస్తరణకు కూడా అవసరం అయ్యింది. ఆయా పనులకు అధికారికంగా బిల్లులు చెల్లిస్తారు. కానీ ఎటువంటి సీనరైజ్ బిల్లులు లేకుండా గ్రావెల్‌ను సమకూర్చుకుంటున్న సదరు సంస్థలు ఎలా నగదు చెల్లిస్తున్నాయో? అని విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం కొన్ని లారీ నంబర్లను తమ వద్ద ఉంచుకొని వాటిని వదిలేస్తున్నారని సమాచారం. కొండల వద్ద పర్యవేక్షణ, నిఘా ఉంచాల్సిన వీఆర్‌ఓలు, తలయారీలు నిమ్మకునీరెత్తినట్టు ఉంటున్నారు. విజిలెన్స్ దాడులు కూడా జరగడం లేదు. దీంతో యలమంచిలి నియోజక వర్గంలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు అధికార హోదాలో జరగడం స్థానికులను ఔరా అనిపిస్తుంది.

చోరీ కేసులో నిందితుడి ఆత్మహత్య


నరాలశెట్టి జ్యోతిష్ దుర్గాప్రసాద్

యలమంచిలి రూరల్ : చోరీ కేసులో నిందితుడుగా ఉన్న యలమంచిలి పట్టణం టిడ్కో గృహ సముదాయానికి చెందిన నరాలశెట్టి జ్యోతిష్ దుర్గాప్రసాద్(21) ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ నెల 20వ తేదీన స్థానిక టిడ్కో కాలనీ సమీపంలో మామిడి తోట వద్ద ఆత్మహత్యకు పాల్పడగా విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు పట్టణ ఎస్‌ఐ కె. సావిత్రి ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. మృతుడు తల్లిదండ్రులు, భార్య, అన్నయ్య, వదినలతో కలిసి స్థానిక టిడ్కో కాలనీలో నివాసముంటున్నాడు. జులాయిగా తిరగడం, చోరీలు చేయడానికి అలవాటుపడిన మృతుడు ఈ నెల 18వ తేదీన వదినకు ఇచ్చిన రూ.2 వేలు తిరిగి ఇవ్వాలని అడగ్గా తండ్రి ఇచ్చిన డబ్బు మళ్లీ ఎందుకు అడుగుతున్నావు. నిన్ను, నీ భార్యను అన్నయ్యే పోషిస్తున్నాడు కదా అని మందలించాడు. అనంతరం ఇంట్లోంచి బయటకు వెళ్లిపోయిన జ్యోతిష్ దుర్గాప్రసాద్ మళ్లీ ఈ నెల 20వ తేదీ రాత్రి టిడ్కో కాలనీకి వచ్చి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను బెదిరించాలని తన శరీరంపై పెట్రోల్ పోసి నిప్పంటించుకున్నాడు. భార్య,కుటుంబ సభ్యులు మంటలు ఆర్పిన తర్వాత తీవ్రంగా గాయపడిన జ్యోతిష్ దుర్గాప్రసాద్‌ను 108 వాహనంలో యలమంచిలి ప్రభుత్వాస్పత్రికి తరలించగా, ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం జ్యోతిష్ దుర్గాప్రసాద్ మృతి చెందాడు. తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడిపై తుని ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్‌లో చోరీ కేసు నమోదై ఉంది.

మహిళపై దొంగల దాడి

అచ్యుతాపురం: మండలంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో దొంగలు హల్‌చల్ చేయడంతో స్థానికంగా కలకలం రేగింది. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మార్టూరు రోడ్డులో ఉన్న ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న పూస శ్రీనివాసరావు ఇంట్లోకి చొరబడిన ఆగంతకులు హాలులో పడుకున్న శ్రీనివాసరావు భార్య నాగమల్లేశ్వరిని తీవ్రంగా గాయపరిచారు. దీంతో ఆమె ముక్కు,నోటి వెంట రక్తం రావడంతో పోలీసులు రంగంలోకి దిగి వివరాలు సేకరించారు. క్లూస్ టీం సంఘటన స్థలం వద్ద ఆధారాలను సేకరించింది. అదే ఇంటికి సమీపంలో ఉన్న మరో ఇంట్లోకి దొంగలు ప్రవేశించి దొంగతనం చేసేందుకు విఫలయత్నం చేశారు. పోలీసులు బాధితుల వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. త్వరలోనే ఆగంతకులను పట్టుకుంటామని సీఐ గణేశ్ తెలిపారు.

మా భూసమస్య తేలాకే సర్వే చేయండి

జేపీ అగ్రహారం రైతుల డిమాండు


రామాలయంలో సమావేశమైన జేపీ అగ్రహారం రైతులు

రోలుగుంట : మా భూసమస్య తేలిన తరువాతే సర్వే చేసుకోవాలని, తమ సాగులో ఉన్న భూములకు సంబంధించిన అన్ని రికార్డులు తమ వద్ద ఉన్నాయని, అధికారులు ఇష్టానుసారం భూ రికార్డులు తారుమారు చేస్తే సహించబోమని జేపీ అగ్రహారం రైతులు స్పష్టం చేశారు. గ్రామంలోని రామాలయంలో వారు ఆదివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా దుంగల శంకర్రావు, మాజీ సర్పంచ్ రొంగల రమణ మట్లాడుతూ పూర్వం నుంచి సాగు చేసుకుంటున్న ఈనాం భూమి సాగు అర్హత తమకు, తమ పిల్లలకు వంశపారంపర్యంగా వర్తిస్తుందన్నారు. సాగులోను, రికార్డుల్లోను తామే ఉన్నా, రెవిన్యూ కార్యాలయంలో రికార్డులు మార్చడం, భూ సర్వే నంబర్లను తహసీల్దార్లు ఇష్టానుసారం మార్పు చేస్తున్నారన్నారు. తమకు ఏ విధమైన నోటీసులు జారీ చేయకుండా బదిలీపై వెళ్లిపోయిన కృష్ణమూర్తి వేరొకరికి పట్టాదార్ పాస్‌పుస్తకాలు జారీ చేయడం అన్యాయమన్నారు. అతనిపై కోర్టులో కేసు ఉందన్నారు. తమకు జరుగుతున్న అన్యాయంపై ఆర్డీవో, జిల్లా కలెక్టర్, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందన్నారు. ఇటీవల తహసీల్దార్ నాగమ్మ సర్వే చేస్తామని గ్రామంలోకి వచ్చి భూములు కాదు, గ్రామ సరిహద్దులు గుర్తిస్తామని చెప్పారని, తొలుత సరిహద్దుల అని చెప్పి, తరువాత సర్వే పూర్తి చేస్తారని అనుమానంగా ఉందన్నారు. తమ భూ సమస్యపై అధికారులు సమగ్ర విచారణ చేసి న్యాయం చేసిన తరువాతే సర్వే ప్రక్రియ చేపట్టాలని రైతులంతా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ జరపాలి

అప్పారావు, బ్రహ్మాజీ


కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతుసంఘ నేతలు

మునగపాక : విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ చేపట్టాలని ఏపీ రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. మండలంలోని చూచుకొండ, గణపర్తి, పల్లపు ఆనందపురం, కుమారపురం గ్రామాల్లో విశాఖ డెయిరీ అవినీతిపై విచారణ చేపట్టి దోషులను శిక్షించాలని కోరుతూ రైతులకు కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాలో పాడి రైతులకు కల్పతరువుగా ఉన్న విశాఖ డెయిరీని తమ స్వార్థ ప్రయోజనాల కోసం రైతులను నష్టాల పాలు చేస్తున్నారన్నారు. ప్రస్తుత పాలకవర్గం అంతులేని అవినీతికి పాల్పడుతుందన్నారు. పాల ధరను కూడా తగ్గించడం ద్వారా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విశాఖ డెయిరీని కాపాడుకునేందుకు త్వరలో జరగనున్న జనరల్ బాడీ సమావేశానికి రైతులు తరలిరావాలన్నారు. కార్యక్రమంలో పాడిరైతులు కాండ్రేగుల రమణ,చదరం వెంకటరమణ, పాలమరిశెట్టి వెంకటప్పారావు, కాండ్రేగుల నాయుడు పాల్గొన్నారు.

ఎరువుల డిపోలో తనిఖీలు

వెయ్యి బస్తాల నిషేధిత ఎరువుల గుర్తింపు


నిషేధిత ఎరువుల బస్తాలతో విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్, ఏవో సోమశేఖర్

కె.కోటపాడు: కె.సంతపాలెంలోని గాయత్రి రైతు డిపోలో ఆదివారం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. విజిలెన్స్ ఎస్‌ఐ రవికుమార్.. మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఆర్‌ఐ నాగేశ్వరరావులతో కలిసి తనిఖీలు జరిపారు. షాపులో ఎటువంటి బిల్లులు లేకుండా, స్టాక్ రిజిస్టర్ లేకుండా నిషేధిత ఎరువులు 1000 బ్యాగులు ఉన్నట్టు అధికారులు గుర్తించినట్టు సమాచారం.

సీఆర్‌సీఎఫ్‌వీ భవనానికి శంకుస్థాపన


సీఆర్ఎఫ్‌వీ పథకం భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి అనిత

పాయకరావుపేట : పెంటకోట తీరప్రాంతంలో కమ్యూనిటీ రీసిలియంట్ కోస్టల్ ఫిషర్‌మెన్ విలేజ్ (సీఆర్‌సీఎఫ్‌వీ) పథకం కింద భవనాలు నిర్మాణానికి హోంమంత్రి వంగలపూడి అనిత ఆదివారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ మత్స్యకారుల సౌలభ్యం కోసం కమ్యూనిటీ హాల్, చేపల ప్లాట్‌ఫారాలు, సోలార్ లైటింగ్, తదితర ఆధునిక సౌకర్యాలతో కూడిన భవనాలు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, చించలపు పద్దూ, చిక్కాల శ్రీనివాసరావు, యాళ్ల వరహాలు, కొప్పిశెట్టి వెంకటేష్, మత్స్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆ జ్ఞాపకాల వీధుల్లో బాల్యం పరుగు

గోపాలపట్నం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం


గోలీ కాయలు ఆట ఆడుతున్న పూర్వ విద్యార్థిని




కర్రాబిళ్ల ఆడుతున్న ఆనాటి విద్యార్థి

గోపాలపట్నం: గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణం ఆదివారం సందడిగా మారింది. తమ బాల్యాన్ని తలచుకుంటూ, బరువైన బాధ్యతలను పక్కన పెట్టి, 1992–93 పదో తరగతి బ్యాచ్‌మేట్స్ తమ పాఠశాలకు చేరుకున్నారు. సుమారు 150 నుంచి 200 మంది విద్యార్థుల అపూర్వ కలయికతో ఆ ప్రాంగణం నవ్వులతో, పాత జ్ఞాపకాలతో నిండిపోయింది. బాల్యంలోని అమాయకత్వంతో, వారు మళ్లీ చిన్న పిల్లలుగా మారిపోయారు. చేతికి జీరు బెల్లంతో తయారు చేసిన వాచీలు, ఉంగరాలు వేసుకుని ఒకరికొకరు చూసుకుని మురిసిపోయారు. గోలీల ఆటలు, టైరు బండి, తాటికాయల బండి, కర్రాబిళ్లా వంటి ఆటలు ఆడుతూ బాల్యపు తీపి అనుభూతులను మరోసారి ఆస్వాదించారు. చిన్నతనంలో తినే చిరుతిండ్లను ప్రదర్శనకు ఉంచి, వాటిని తింటూ ఆనాటి రుచులను గుర్తు చేసుకున్నారు.ఈ సమావేశం అల్లరి అల్లరిగా, ఉత్సాహంగా సాగింది. ఒకరినొకరు నాటి జ్ఞాపకాలను పంచుకుంటూ నవ్వుకున్నారు. 'అప్పుడు బద్ధ శత్రువులం, ఇప్పుడు ప్రాణ స్నేహితులం' అంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆపైన నృత్యాలు, విందు వినోదాలతో కార్యక్రమం ముగిసింది. పాఠశాల వదిలి వెళ్లినా, తరగని తమ స్నేహబంధానికి, బాల్యపు జ్ఞాపకాలకు ఈ అపూర్వ కలయిక ఒక నిలువుటద్దంగా నిలిచిపోయింది.


జీరు బెల్లంతో వాచీలు ఉంగరాలు చేయించుకుంటున్న పూర్వ విద్యార్థులు

అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు

పొక్లెయిన్, ట్రాక్టర్ సీజ్


పోలీసులు సీజ్ చేసిన పొక్లెయిన్, ట్రాక్టర్

యలమంచిలి రూరల్ : ఏటికొప్పాక శివారు ప్రాంతంలో కొండను తవ్వి గ్రావెల్‌ను అక్రమంగా తరలించడానికి వినియోగించిన పొక్లెయిన్, ట్రాక్టర్‌ను యలమంచిలి రూరల్ ఎస్‌ఐ ఎం.ఉపేంద్ర ఆదివారం స్వాధీనపర్చుకున్నారు. ఇక్కడ అనుమతి లేకుండా గ్రావెల్ తవ్వుతున్నారన్న సమాచారం అందుకున్న ఆయన సిబ్బందిని అక్కడకు పంపించి వాహనాలను స్వాధీనపర్చుకుని యలమంచిలి రూరల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై ఆదివారం సెలవు కావడంతో సోమవారం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకోనున్నట్టు ఆయన తెలిపారు.

అనకాపల్లి పోలీసుల సైకిల్ ర్యాలీ


విశాలాక్షినగర్‌లో ర్యాలీగా బయలుదేరిన ఏఆర్ పోలీసులు

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ నగరం విశాలాక్షినగర్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ పోలీస్ మైదానం నుంచి అనకాపల్లి జిల్లా పోలీసులు ఆదివారం ఫిట్ ఇండియా ఉద్యమంలో భాగంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. కైలాసగిరి కూడలి నుంచి బయలుదేరి జోడుగుళ్లపాలెం నుంచి బీచ్ రోడ్డులో సీతకొండ మీదుగా సాగర్‌నగర్ వరకు ఉత్సాహంగా ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఏఆర్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కీలకమన్నారు. ఆరోగ్యం దేశాన్ని బలోపేతం చేసి శక్తని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, మన్మథరావు, రమణమూర్తి, సంజీవిరావు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో వసతి వెతలు

- బాలికలకు వసతి కొరత
- హాస్టల్ సీట్లు 50.. డిమాండ్ వందల్లో..
- రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన భవనం నిరుపయోగం
- దూరప్రాంత డిప్లొమా విద్యార్థినుల అవస్థలు


విశాఖపట్నం పాలిటెక్నిక్‌లో నిరుపయోగంగా ఉన్న బాలికల హాస్టల్ భవనం


భవనం చుట్టూ పెరిగిపోయిన జంగిల్

మురళీనగర్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో సరైన వసతి సదుపాయం సరిగ్గా లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 9 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరిలో చాలామంది దూరప్రాంతాల నుంచి వచ్చి విద్యాభ్యాసం చేస్తున్నారు. వసతి గృహాలు అందుబాటులోకి రాక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా బాలికలు వసతి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి విశాఖలో కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్), పెందుర్తి, అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నం , చోడవరం, భీమిలి బాలికలు, పాడేరులో గవర్నమెంట్ మోడల్ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో చాలా కాలేజీల్లో హాస్టల్ సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి.

ఉమ్మడి జిల్లాలోని 9 ప్రభుత్వ కాలేజీల్లో

- భీమిలి మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో బాలికలకు వసతి సదుపాయం ఉంది.
- పాడేరు ప్రభుత్వ ఆదర్శ రెసిడెన్షియల్ పాలిటెక్నిక్‌లో బాలురకు మాత్రమే హాస్టల్ సదుపాయం ఉంది. నర్సీపట్నంలో హాస్టల్ భవనం ఉన్నా.. కోవిడ్ తర్వాత మూసేశారు. హాస్టల్ నిర్వహణకు ప్రత్యేక సిబ్బంది ఉన్నప్పటికీ దీని నిర్వహణను పట్టించుకోలేదు.
- ఇక అనకాపల్లి, చోడవరం, పెందుర్తి పాలిటెక్నిక్ కళాశాలల్లో వసతిగృహాలే లేవు. దీంతో అక్కడ కాలేజీ దూరప్రాంత విద్యార్థులు చేరినా బయట వసతి వెదుక్కోవాల్సిన పరిస్థితి.
- కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో బాలురకు మాత్రమే స్టూడెంట్స్ మేనేజిమెంట్ హాస్టల్ ఉంది. ఈ హాస్టల్‌లో 350మంది వరకు బాలురకు అవకాశం కల్పిస్తున్నారు.
- విశాఖపట్నంలోని కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రాంగణంలో బాలికల కోసం ప్రత్యేకంగా వసతి గృహాన్ని రూ.కోట్లు వెచ్చించి నిర్మించినా అందుబాటులోకి తేవడంలో సాంకేతిక విద్యాశాఖ విఫలమైంది. ఈ కాలేజీలో 500మందికి పైగా బాలికలు చదువుతున్నారు. పాలిటెక్నిక్‌లో 100మంది వరకు వసతి కల్పించే విధంగా భవనం నిర్మించినా ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంది.
- ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్)లో వుమెన్స్ హాస్టల్‌ను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ చదలవాడ నాగరాణి ఆదేశాల మేరకు ప్రారంభించారు. ఇక్కడ 50 మంది విద్యార్థులకు వసతి కల్పించారు. అయితే, ఇక్కడ ప్రత్యేక సిబ్బంది లేకపోవడంతో విద్యార్థినులకు రక్షణగా కాలేజీ సిబ్బందిని వినియోగిస్తున్నారు. వీరికి సమీపంలోని పాలిటెక్నిక్ బాలుర హాస్టల్ నుంచి భోజనాలు తీసుకువస్తున్నారు. భోజనాలు తీసుకురావడానికి ఆటో చార్జీలను విద్యార్థులే భరిస్తున్నారు. 'గైస్' కాలేజీ హాస్టల్‌కు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించి ఇక్కడే భోజనం వండి అందించే ఏర్పాట్లు చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పెరుగుతున్న డిమాండ్

డిమాండ్‌కు తగిన విధంగా హాస్టల్ సీట్లు లేవు. గైస్‌లో నాలుగు కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచీల్లో ఏయూ రీజియన్‌తో పాటు ఎస్వీ యూనివర్సిటీ రీజియన్‌కు ప్రత్యేకంగా కొన్ని సీట్ల రిజర్వేషన్ ఉంటుంది. దీంతో ఎస్వీయూ పరిధి జిల్లాల నుంచి బాలికలు ఎక్కువగా ఈ కళాశాలలో చేరుతున్నారు. పాలిటెక్నిక్ కాలేజీలోనూ ఎస్వీయూ పరిధిలోని విద్యార్థులు చేరారు. దీంతో వీరు కాలేజీ హాస్టల్‌లోనే ఉండాలని అభిలషిస్తున్నారు. గైస్ హాస్టల్‌లో కేవలం 50 సీట్లు మాత్రమే ఉన్నాయి. డిమాండ్ వంద మందికి పైగా ఉంది. పాలిటెక్నిక్ కాలేజీ బాలికలకు కూడా ఇక్కడ వసతి కల్పిస్తున్నారు. దీని వల్ల ఇతర దూర ప్రాంత జిల్లాల బాలికలకు వసతి కల్పించలేకపోతున్నారు. ముఖ్యంగా ఫస్టియర్ విద్యార్థులకు వసతి కొరత ఉంది. కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రాంగణంలో నిర్మించిన భవనాన్ని అందుబాటులోకి తీసుకువస్తే సుమారు వందమందికి వసతి కల్పించేందుకు అవకాశం ఉంటుంది. విద్యార్థినులకు వసతి సమస్య తీరుతుంది. ఆ దిశగా సాంకేతిక విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


విద్యార్థులు

క్లుప్తంగా

అన్న సమారాధన



అన్నసమారాధన కార్యక్రమం ప్రారంభిస్తున్న ముత్యాల రాజేష్

అనకాపల్లి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా స్థానిక నర్సింగరావుపేటలో ఆదివారం నిర్వహించిన అన్న సమారాధనను ముత్యాల గార్మెంట్స్ అధినేత ముత్యాల రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించే వారికి ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబిక అమ్మవారికి హోం మంత్రి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి అనిత, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక అమ్మవారిని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ఆదివారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం దేవదాయ సహాయ కమిషనర్ కె.వి.సుధారాణి వారికి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



పల్లపు సోమవరంలోని షిరిడి సాయినాథ స్వామి

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో గల షిరిడి సాయి నాథ మందిర 12వ వార్షికోత్సవం సోమవారం పెద్ద ఎత్తున నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త, చైర్మన్ గొంతిన శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి క్షీర, జల అభిషేకాలు, ప్రత్యేక పూజలు స్వామి వారికి నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం, రాత్రి భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు. ఉభయ విశాఖ జిల్లాలోని విశాఖ, గాజువాక, అనకాపల్లి ప్రాంతాలకు చెందిన ఆరు బృందాలతో కుచిపూడి, భరత నాట్య ప్రదర్శనలు మధ్యాహ్నం జరుగుతాయని చెప్పారు. సాయంత్రం స్వామి వారి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తామని తెలిపారు. రాత్రి ఏకాహం జరుగుతుందన్నారు. భారీగా బాణసంచా కాలుస్తామన్నారు. ప్రజలు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

రాజా :సార్ మేడమ్
సత్యనారాయణ స్క్రీన్-1: పరద
సత్యనారాయణ స్క్రీన్-2:మేఘాలు చెప్పిన ప్రేమ కథ
పర్తిసాయి : మహావతార్ నరసింహ
షిర్డిసాయి :కూలి
వెంకటేశ్వర :బన్ బట్టర్ జామ్
శ్రీ సత్య : సోమేశ్వర సులోచన
రామచంద్ర : వార్ 2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 81 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-9, బి పాజిటివ్-27, ఒ పాజిటివ్-40, ఏబీ పాజిటివ్-5 యూనిట్ల శుద్ధిచేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్(ఫోన్ నంబర్.9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 256 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలెండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (ఫోన్ నంబర్.08924-223595)ని సంప్రదించవచ్చు.

దివ్యాంగులను ఏడిపించేన

- పెన్షన్లలో భారీగా కోత
- కశింకోట మండలంలో 232 మందికి నిలిపివేత
- గగ్గోలుపెడుతున్న దివ్యాంగులు



సదరం సర్టిఫికెట్ రీ వెరిఫికేషన్ కోసం వచ్చిన ఆర్థోపెడిక్ దివ్యాంగులు (ఫైల్)

కశింకోట: దివ్యాంగులపై కూడా కూటమి ప్రభుత్వం కర్కశంగా వ్యవహరిస్తోంది. అనర్హత పేరుతో అడ్డగోలుగా పింఛన్లు తొలగిస్తోంది. వారికి ఉన్న ఆసరాను దూరం చేస్తోంది. అంగ వైకల్యం ఉన్నప్పటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు తొలగించడం పట్ల మండలంలోని బాధిత దివ్యాంగులు ఆందోళన చెందుతున్నారు. వైకల్యం అర్హతను నిరూపించుకోవాలని మరి కొందరికి నోటీసులు అందజేస్తుండడంతో వారు గగ్గోలు పెడుతున్నారు.చాలా కాలంగా ఇస్తున్న పింఛన్లు అన్యాయంగా తొలగించారని ఆవేదన చెందుతున్నారు. తొలగించినవాటిలో ఒక కన్ను కనిపించని దివ్యాంగుల పింఛన్లే ఎక్కువగా ఉన్నాయి. 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందనే సాకుతో పింఛన్ల తొలగించడం పట్ల నిరసన వ్యక్తమవుతోంది. దివ్యాంగులకు పింఛన్ పొందే హక్కు ఉందని, మానవతా దృక్పథంతో నిబంధనలు మార్పు చేసి పింఛన్లు పునరుద్ధరించడానికి ప్రభుత్వం చొరవ చూపి, న్యాయం చేయాలంటున్నారు. మండలంలో సుమారు 1,100 ఎన్టీఆర్ భరోసా దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. వీటిలో ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన రీఎసెస్‌మెంట్ కార్యక్రమంలో వైద్యుల నిర్ధారణ మేరకు 40 శాతం కంటే తక్కువ వైకల్యం ఉందన్న సాకుతో 232 మంది దివ్యాంగుల పింఛన్లు నిలిపి వేశారు. మండలంలో 27 పంచాయతీలున్నాయి. వాటిలో ఒక్కొక్క పంచాయతీలో 8 నుంచి 20 పైగా తొలగించారు. బయ్యవరం, జమాదులపాలెం, ఉగ్గినపాలెం,పరవాడపాలెం తదితర గ్రామాల్లో 8 చొప్పున చింతలపాలెంలో 20, కశింకోట 30 ఇలా దాదాపు ప్రతి గ్రామంలో దివ్యాంగ పింఛన్లు తొలగించారు. బయ్యవరంలో 9 దివ్యాంగ పింఛన్లు తొలగించగా, వాటిలో ఆరు పింఛన్లు ఒక కన్ను లోపం ఉన్న వారివే కావడం విశేషం. ఈ మేరకు బాధితులకు అధికారులు నోటీసుల ద్వారా తెలియజేశారు.సెప్టెంబర్ నుంచి పింఛన్ నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో వారు ఆందోళన చెందుతున్నారు. దాదాపు అంతా పేదవారు. కుటుంబ సభ్యులపైన ఆధారపడి, కూలీ పనులు సాగించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటువంటి దుస్థితిలో ఉన్న వారి పింఛన్లను నిబంధనల పేరుతో తొలగించడం అన్యాయమంటున్నారు. ఆర్థోపెడిక్, వినికిడి లోపాలు తదితర సమస్యలున్న వారి పింఛన్లు నిలిపివేశారు. వీరిలో సుమారు 20 ఏళ్లుగా పింఛన్ తీసుకుంటున్నవారు ఉన్నారు. దీంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పునఃపరిశీలన చేసి మానవతా దృక్పథంతో పింఛన్లు ఇప్పించాలని కోరుతున్నారు.

పింఛన్ తొలగించడం అన్యాయం



నాకు ఒక కన్ను మాత్రమే కనిపిస్తుంది. పింఛన్ డబ్బులు ఆధారంగా జీవనం సాగిస్తున్నాను. చాలా కాలంగా పింఛన్ వస్తోంది. వైకల్యం ఉన్నా పింఛన్ తొలగించడం అన్యాయం. పింఛన్ పునరుద్ధరణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–రాయవరపు సత్య, బయ్యవరం

పింఛనే ఆధారం



నాకు ఒక కన్ను కనిపించదు. ఆంగవైకల్యం 40 శాతం కంటే తక్కువ ఉందని పింఛన్ తొలగించారు. నా కుటుంబాన్ని నెట్టుకు రావడానికి దివ్యాంగ పింఛనే ఆధారం. మానవతా దృక్పథంతో పునరుద్ధరించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–గుర్రం శ్రీనివాసరావు, బయ్యవరం

పింఛన్ నిలిపివేయడం తగదు



నాకు ఒక కన్ను కనిపించదు. అంగవైకల్యం వల్ల వివాహం కాలేదు. చాలా కాలంగా దివ్యాంగ పింఛన్ వస్తోంది. అదే నాకు జీవనాధారం. వైకల్యంతో బాధపడుతున్న నాకు పింఛన్ నిలిపివేయడం శోచనీయం.

–అంగారపు సత్యవతి, బయ్యవరం.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటో కార్మికులతో మాట్లాడుతున్న ఎస్ఐ లక్ష్మణరావు

కశింకోట: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ కె. లక్ష్మణరావు సూచించారు. స్థానిక నూకాంబిక ఆటో యూనియన్ కార్మికులకు ఆదివారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి ఆటోలు నడపరాదని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. యూనియన్ ప్రతినిధులు బత్తిన వీరభద్రరావు, ఒమ్మి శ్రీనివాసరావు,మోసూరు చిన్న, నీలపాటి లోవరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ కళ్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. 108 స్వర్ణసంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తరపూజ నిర్వహించారు. ఉభయ దాతలకు శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఉదయం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారిపై ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు,ప్రసాదం,శేషవస్త్రాలు అందజేశారు. స్వామి వారికి గరుడసేవ శాస్త్రోక్తంగా జరిగింది.

ఉచితంగా మట్టి గణపతుల పంపిణీ



మట్టి గణపతులను పంపిణీ చేస్తున్న భీమరశెట్టి రాంకీ, కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను మాత్రమే పూజించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ భీమరశెట్టి రాంకీలు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ వద్ద గ్రీన్‌క్లబ్ వ్యవస్థాపకుడు కొణతాల ఫణిభూషణ్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచితంగా 3,500 మట్టిగణపతుల ప్రతిమలు, వినాయకవ్రతకల్ప పుస్తకాలు, పసుపు, కుంకుమ, మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో 12 సంవత్సరాలుగా ఉచితంగా మట్టిగణపతుల ప్రతిమలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కర్రి సన్యాసినాయుడు, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు సత్యనారాయణ, పెంటకోట ఉమామహేశ్వరరావు, నయిశెట్టి సత్తిబాబు, యల్లపు సూరిఅప్పారావు, వంకాయల ఈశ్వరరావు, శ్రీను, గంట్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్: పట్టణంలోని పలు చోట్ల మట్టి గణపతి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సుమారు 200 మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ మానిటరింగ్ మెంబర్ రేబాక మధుబాబు, కళాశాల ప్రిన్సిపాల్ స్వాతి మనోజ్ కుమార్, నిరంతర్ సేవా ఫౌండేషన్ కార్యదర్శి కొమ్మోజు గణేష్ తదితరులు పాల్గొన్నారు.విజయరామరాజు పేట పబ్లిక్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 1000 మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వినాయక నిమజ్జనోత్సవ కమిటీ చైర్మన్ ఆడారి కుమార స్వామి, ఆళ్ళ శివరామ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రామచంద్ర థియేటర్ జంక్షన్ వద్ద సుమారు 500 మట్టి గణపతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఓరుగంటి రాఘవరావు, ధనాల వెంకటరావు, పర్వతనేని శ్రీనివాస్, గోల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించాలి



శ్రీకృష్ణుని దర్శించుకున్న మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు, జాజుల రమేష్

అనకాపల్లి: ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత జానకీరామరాజు దంపతులు అన్నారు. శ్రీకృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక నర్సింగరావుపేట గొల్లవీధిలో ఆదివారం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జానకీరామరాజు దంపతులు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్‌ను ఆలయ కమిటీ సభ్యులు దుశ్శాలువాలతో సత్కరించి, కృష్ణుడు చిత్రపటాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోన ఉమా, ముఖేష్, మురళీ, భాష, ఆవుపాటి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ. 2 లక్షల విరాళం



సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి ఆదివారం విశాఖ నగరంలోని ఆటోనగర్‌కి చెందిన జి.వెంకటనాయుడు దంపతులు రూ. 2 లక్షల 8 వేల విరాళాన్ని అందజేశారు. సంబంధిత చెక్కుని పీఆర్‌వో కార్యాలయంలో ప్రోటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావుకి అందజేశారు. దేవస్థానం తరపున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌వో కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ వరహానరసింహం పాల్గొన్నారు.

తూర్పు కాపుల సంక్షేమానికి కృషి



సమావేశంలో తూర్పుకాపుల సంక్షేమంపై చర్చిస్తున్న నాయకులు

యలమంచిలి రూరల్: జిల్లాలో తూర్పు కాపుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు, న్యాయవాది కరణం శ్రీహరి తెలిపారు. ఆదివారం యలమంచిలిలో ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో జిల్లా తూర్పుకాపు సంక్షేమ సంఘం సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలో తూర్పుకాపులు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. అనంతరం 7 నియోజకవర్గాలకు తూర్పుకాపు పరిశీలకులను నియమించారు. అడపా శేషగిరిరావు (పాయకరావుపేట), వెలంశెట్టి శ్రీనివాసరావు(పెందుర్తి), అందే రమణ(యలమంచిలి), నక్కా శివశంకరావు(అనకాపల్లి), సిరిగిశెట్టు నానాజీ(నర్సీపట్నం), అన్నం రమణ(మాడుగుల), పోలిన సూర్య జగ్గారావు(చోడవరం) పరిశీలకులుగా నియమితులయ్యారు. కార్యక్రమంలో జెర్రిపోతుల వెంకట్రావు, పాలిపిని రాము, పతివాడ గణేష్, రావి రామసత్యం పాల్గొన్నారు.

నేడు 3 గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మునగపాక: మండలంలోని చెర్లోపాలెం, మడకపాలెం, రామగిరి గ్రామాల్లో బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు జరిగే కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ హాజరు కానున్నారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు రచ్చబండ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజలకు ఇబ్బంది లేకుండా గణేష్ మండపాలు

కశింకోట: గణేష్ ఉత్సవాలు సందర్భంగా ప్రజలకు ఇబ్బంది లేని విధంగా వినాయక మండపాలను నిర్వాహకులు ఏర్పాటు చేసుకోవాలని సీఐ అల్లు స్వామినాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బాధ్యత వహించాలని తెలిపారు. వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలన్నారు. పోలీసు స్టేషన్‌కు ఆన్‌లైన్‌లో అప్లికేషన్ చేరిన తర్వాత దానిని పరిశీలించి ఆమోదం పొందిన అనంతరం మండపం నిర్వాహకులకు పూర్తి వివరాలతో కూడిన క్యూఆర్ కోడ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీన్ని ఉత్సవ నిర్వాహకులు తమ మండపం వద్ద ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరగడానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఆదిత్యునికి అభిషేకాలు

పెందుర్తి: సుజాతానగర్‌లోని సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువ జామున స్వామివారికి పంచద్రవ్యాలతో విశేష అభిషేకాలు చేశారు. ఆదిత్యునికి పంచ హారతి, నక్షత్ర హారతి ఇచ్చారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

రౌడీ షీటర్లపై నిరంతర నిఘా

పెందుర్తి: సర్కిల్ పరిధిలోని రౌడీ షీటర్లపై నిరంతర నిఘా ఉంచుతున్నామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్‌కుమార్ అన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే జైలు పాలు కావాల్సి వస్తుందని ఆదివారం కౌన్సెలింగ్‌లో హెచ్చరించారు. ప్రతి వారం స్టేషన్‌కు వచ్చి సంతకాలు పెట్టాల్సిందే అని స్పష్టం చేశారు. ఎస్ఐలు, ఏఎస్ఐలు, హెచ్‌సీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

పరవాడ: పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం సాధ్యమని జేఎన్‌పీసీ సంఘ ప్రతినిధి జెట్టి సుబ్బారావు అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి డీసీఏ బృందం జేఎన్‌పీసీలో స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర డ్రైవ్ అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా జేఎన్‌పీసీ భాగస్వామ్యంతో రాంకీ ఫార్మాసిటీ, డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్, తయారీదారుల సంఘం సంయుక్తంగా పాల్గొని ఫార్మాసిటి ఎంట్రీ పాయింట్ వద్ద గుంతలు పూడ్చడం, పరిసరాల పరిశుభ్రత, కాలువల శుభ్రత, నీటి నిల్వల తొలగింపు, పారిశుధ్యం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు అభిప్రియ, కూన కల్యాణి, ఎన్.కల్యాణి, ఇందిర, భారతి, రాంకీ ఫార్మాసిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గూడుపమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



గూడుపమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నక్కపల్లి: మండలంలో రేబాకలో వనదేవత గూడుపమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తుల తాకిడి పెరిగింది. నక్కపల్లి, అడ్డురోడ్డు, ఎస్.రాయవరం, పాయకరావుపేట, ఉపమాక, తుని తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, సర్పంచ్ తళ్ల భార్గవ్, ఉపమాక దేవస్థానం అర్చకులు కృష్ణమాచార్యులు తదితరులు దర్శించుకున్నారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పు చేసి సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం తిరుగు పయనమయ్యారు.

ఉత్తమ చిత్రాలను ఆదరించాలి



మాట్లాడుతున్న అనకాపల్లి ఫిలిం సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి తమ్మన సుబ్బారావు

అనకాపల్లి టౌన్: ఉత్తమ చిత్రాలను ప్రేక్షకులు ఆదరించించాలని అనకాపల్లి ఫిలింసొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి తమ్మన సుబ్బారావు అన్నారు. స్థానిక ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఫిలిం సొసైటీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సొసైటీ ద్వారా 2009 నుంచి 2019 పదేళ్ల పాటు పలు జాతీయ, అంతర్జాతీయ చిత్రాలను ప్రజలకు అందించామన్నారు. ఫిలింసొసైటీ కార్యదర్శి పి.ఎస్. అజయ్ కుమార్ మాట్లాడుతూ ఆంగ్ల ఉపాధ్యాయునిగా వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన కమలాకర్ మాస్టార్ మృతి చెంది ఐదేళ్లు కావస్తోందని, ఆయన సొసైటీకి విశేష సేవలందించారని చెప్పారు. ఆయన చేసిన సేవలకు గుర్తుగా ఈ నెల 31న 35 చిన్న కథ కాదు చిత్రాన్ని ప్రదర్శిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సొసైటీ అధ్యక్షురాలిగా సరిపల్లి సూర్యకుమారి, ఉపాధ్యక్షుడిగా వేణు మాస్టార్, కార్యదర్శిగా ఐ.ఆర్. గంగాధర్, కోశాధికారిగా శ్రీధరాల సూర్యనారాయణలను ఎన్నుకున్నారు.

బియ్యం బస్తాలు, తువ్వాళ్ల పంపిణీ



మహిళకు తువ్వాళ్లు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అనకాపల్లి టౌన్: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మలసాల భరత్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలోని 82వ వార్డు లెప్రసీ కాలనీలో ఆదివారం బియ్యం బస్తాలు, తువ్వాళ్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి మలసాల కుమార్ రాజా పాల్గొన్నారు. అంతకుముందు బర్త్‌డే కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 82వ వార్డు కార్పొరేటర్ మందపాటి సునీత మాట్లాడుతూ పేద ప్రజలను అక్కున చేర్చుకొనే పార్టీ వైఎస్సార్‌సీపీయేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు కడ్మిశెట్టి సతీష్, బూత్ కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడు గైపూరి రాజు, 80వ వార్డు ఇన్‌ఛార్జ్ కె.ఎం. నాయుడు, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, పార్టీ నాయకులు కొణతాల మురళీ కృష్ణ, బొడ్డేడ శివ, మునూరు శ్రీనివాసరావు, కెల్లా శ్యామ్, శింగపల్లి రాజేశ్వరీ, నల్లమల్ల కొండలరావు, నంబారు ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా మహాసభల విజయవంతానికి పిలుపు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐద్వా జిల్లా అధక్షురాలు మాణిక్యం

పరవాడ: అక్టోబరు 13, 14, 15 తేదీల్లో జరగనున్న ఐద్వా రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని అనకాపల్లి జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగిన కార్యక్రమంలో మహాసభల పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చిన్నారులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఐద్వా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు మన్యాల బంగారమ్మ, తుంపాల అన్నపూర్ణ, దేవి, సాయి, మంగమ్మ, లక్ష్మమ్మ, రాజకుమారి పాల్గొన్నారు.

పెందుర్తి పోలీసులకు రివార్డులు



రివార్డు అందుకుంటున్న ఎస్ఐ సూరిబాబు, సిబ్బంది

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోరీ కేసుల్లో ప్రతిభ కనబరిచిన పెందుర్తి క్రైం విభాగం పోలీసులను నగర పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చి సత్కరించి రివార్డులు అందజేశారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.శ్రీనివాసరావు, ఎస్ఐ డి.సూరిబాబు, ఏఎస్ఐ కె.శ్రీనివాసరావు, హెచ్‌సీలు జి.నాగరాజు, వి.పేరయ్యనాయుడు, టి.పద్మజ, పీసీలు టి.శివప్రసాద్, వి.విజయ్‌కుమార్, బి.దేముడునాయుడు, ఆర్.వెంకటేష్, ఎల్.సింహచలంనాయుడు, ఎల్.తాతారావు, యు.చంద్రకళ, ఆర్.సంతోషిలను సీపీ కార్యాలయంలో సీపీ ప్రత్యేకంగా అభినందించారు.